జలగ

— బమ్మిడి జగదీశ్వరరావు

నిప్పుల పుటం పెట్టినట్లు అప్పటి దాకా ఎర్రగా కాచిన ఎండ మరుక్షణంలోనే మంచు కురిసినట్లు మబ్బులు కమ్ముకొని చల్లబడింది. అంతదాకా బందీ అయిన గాలి స్వేచ్ఛగా తిరుగాడుతూ వాతావరణం మార్పిడికి దోహదపడుతోంది. సమయం సాయంత్రమే అయినా చీకటి పడినట్లుగానే అనిపిస్తోంది. అందుకేనేమో వీధి లాంతర్లు వెలిగాయి.

ఎంకడు ఎదనిండా ఊపిరి పీల్చుకున్నాడు. చెమటతో తడిసిన ఖద్దరు బనీనూ, పంచె ఆరిపోయాయి.

అసలు ఎంకడికి ఆ వాతావరణం చూస్తుంటే సలిదన్నం కడుపు నిండా పెరుగు మిరపకాయలతో తిన్నట్టుగా వుంది. చుట్టూ చూసాడు. బేరాలేమీ రాలేదు. రిక్షా వెనుక రెండు చక్రాలకు రాళ్ళు పెట్టి రిక్షాలోనే కూర్చొని అలాగే వెనక్కి చేరగిల బడిపోయాడు.

"ఏటో పగలంతా ఎండ కాసేసి మా పేనాలు తోడేత్తాది. రిక్షా ఏత్తే ఒళ్ళు సర్రున కాల్తాది. బుర్రయితే ఏడికి పొగలు బయలు దేరుతాయి. కనకాలు బుర్ర మీద నువ్వుల నూనేసి రుద్దితే ఎంత పొంగు ఎక్కిందీ? వంటికీ ఏడిసేసి పోనాది...అయితే ఇప్పుడు ఎండ వానయినట్టుగా వుంది. దీనికీ ఎగతాళే గావల్ల..." ఆలోచనలు సాగుతున్నాయి ఎంకడి నిండా.

"ఏయ్... రిక్షా...చాపల మార్కెట్టుకి వస్తావా?" ఎవరో ఆసామి మామూలుగా అడగలేదు. రిక్షా బెల్లు కొట్టి మరీ అడిగాడు. అందుకే అంత తొందరగా ఆలోచన కివతల పడ్డాడు ఎంకడు.

"ఆ..." అన్నాడు ఎంకడు.

"ఎంత తీసుకుంటావు?" అడిగాడాసామి.

"నాలూపాయలివ్వండి బాబూ" ఎంకడు రిక్షా దిగుతూ అడిగాడు.

"నాలూపాయలే..." గుండాగిపోయినట్లుందాసామికి.

"రెండ్రూపాయలు తీస్కో..."

"కుదర్దండీ..."

"పోనీ రెండుంపావలా"

"కిట్టదండీ..."

"కిట్టక పోడానికిదేమన్నా యాపారమా ఏటయ్యా..."

"మీరు బేరమాడుతుంటే ఎవులయినా అలాగే అనుకుంతాయి...

"చాల్లాల్లే...ఆటోకే అయిదు రూపాయిలు...అరగంటలో పోవచ్చు" "నాకు గంట పడతాదండి...అలాగయితే నే పది రూపాయలన్నా తీసుకోవాలి. మల్ల నా ఒంట్లున్నది ఎక్కడోయించుకొనె డీజిలు పెట్రోలూ కాదు...రక్తం..."

"కూలి ముండకొడుకు..." ఏదో నోట్లోనే గొణుక్కుని "మరో పావలా నీ ఇష్టం..."అంటూ వెళ్ళిపోయాడాసామి. వాడు తిట్టిన తిట్టు ఎంకడికి వినిపించలేదు. వినిపిస్తే ఏమనేవాడో? మళ్ళీ రిక్షా ఎక్కి కూర్చున్నాడు ఎంకడు. ఆలోచిస్తున్నాడు.

"...తను...ఎన్ని మాట్లాడేసాడు? పెట్రోలు-రక్తమూ ఆహ్...అయినా అన్ని ఏళ్ళా ఒకటే బేరమా? వానొచ్చేటట్టుంది ఎదురు గాలి. కష్టమాలో సించరు.. అయినా పిల్లలిద్దరూ వచ్చే ఏలయ్యింది. మరెటూ కదల్ను. ఈలొస్తే వర్షము రాకుండానే ఇల్లు సేరుకోవచ్చు..."

తరువాత ఎంకడు బనీను లోజేబులోని డబ్బులు తీసి లెక్కపెట్టుకున్నాడు. ఇరవయ్యేడు రూపాయలు...అయినా ఈ నెల్లో ఎలాగయిన సేసి ఆల పుస్తకాలు కొనెయ్యాల...కనకం పట్టీలు తాకట్టుకు వడ్డీ తరువాత కట్టుకోవాల...ముందు సదువు. "ఆలయినా సదువుకుంటే వుజ్జోగం వస్తాది. 'ఆలూరిచ్చావోళ్ళు కాకూడదు" ఎన్నో మార్లు లాగే ఆసారి నిర్ధారించుకున్నాడు.

ఎంకడికి భవిష్యత్తు మీద ఆశలున్నాయి. అవి తీర్చుకోడానికి కాయకష్ట పడతాడు. కానీ ఎటొచ్చి జానెడు పొట్ట, జీవితాన్నంతా మింగేస్తోంది.

అప్పటికే తన మీద ఆలపేట ఉసూరు మంటందనీ...ఉసూరుమని పదిమంది కళ్ళు పడితే ఏ మనిషయినా మసై పోతాడనీ ఎంకడు అనుకుంటూ వుంటాడు.

ఎంకడు రిక్షా దిగి చూసాడు.

పిల్లలు ఇంకా రాలేదు. చిన్నగా వర్షం మొదలయింది. బేరమొచ్చినా కాదని బడివేపు రిక్షాను పోనిచ్చాడు. దారిలోనే పిల్లలు ఎదురయ్యారు.

"తడుసుకోని ఎవుడు రమ్మన్నాడు. జలుబూ...జొరమూ చేస్తే ఒకదానికొకటి" కోప్పడ్డాడు ఎంకడు.

మనిషినీ మనిషినీ విడదీసే 'కులం' వికృతే కాని ప్రకృతి కాదు. సహజంగా మనిషి మరో మనిషికి దూరంగా వుండాలని కోరుకోడు. అయితే, వికృతే ప్రకృతిగా భావించే సమాజంలో, మనిషినీ మనిషినీ కలిపే సందర్భం మహత్తర మైనది. రక్తంలోకి చొరబడాలనే 'కులం' జలగను రక్తం కక్కించడం గొప్ప వైద్యమే.

పిల్లలిద్దరూ రిక్షా ఎక్కారు. ఎంకడు అంత వర్షంలోనూ గూడు వేగిరం చేరుకోవాలని బలంగానే తొక్కాలని ప్రయత్నిస్తున్నాడు. "పెద్దోడా, పాటాలు సెప్పినారా?"

"ఆ రోజంతటికీ ఒకే మేస్ట్రు చెప్పాడు. మిగిలినోళ్ళు ప్రజెంటు ఏసేసి బాతాఖానీ కబుర్లాడుకున్నారు" చెప్పాడు కొడుకు. వాడికి పదిహేనేళ్ళుంటాయి. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అంత పద్ద చదువు లెవరూ మా గూడేంలోనే చదవ లేదని ఎంకడు మురిసిపోతుంటాడు. పాఠాలు చెప్పనందుకు 'దొంగనాకొడుకులు' మనసులోనే తిట్టుకుని "మరినీ కమ్మా నచ్చిమీ..." కూతుర్ని అడిగాడు ఎంకడు. "ఆ...అయినాయి" అందా పిల్ల. "ఏటయినాయి. ఇదిప్పుడే ఒండుకి వచ్చింది. దీనికి పాటాలుండవు..."తనకే పాటాలుంటాయనే గర్వం కొడుకు సూరి గొంతులో కన్పిస్తోంది. వర్షం పడుతూనే వుంది. ఎంకడు రిక్షా తొక్కుతూనే వున్నాడు. రిక్షా మాత్రం ఇంకా ఆ ఊరు మాత్రమే దాటింది. ఎంకడు కాపురం చేసే ఊరుకీ-రిక్షా వేసే ఈ ఊరికీ దూరం ఏడు కిలోమీటర్లు వుంటాది.

మధ్యలో అంతా మట్టి రోడ్డే. బండి జాడి మీదుగా రిక్షా పోతోంది. నలిగిన దారి అవడం, అలవాటు కావడంవల్ల ఎంకడికి అంత కష్టంగా లేకపోయినా కాళ్ళు తోడేస్తున్నాయి. ముడుకులు సలుపు పెడుతున్నాయి. రిక్షా అందుకే నెమ్మదిగా పోతోంది. ఇందాకటి స్పీడు లేదు.

"అయ్యా...నువ్వు దిగరా నేను తొక్కుతాను..." కొడుకు సూరి అడిగాడు.

"నువ్వు కూకోరా సినుకులు కదా, నానే తొక్కుతాను" సర్దిచెప్పబోయాడు ఎంకడు.

రచయిత వినోదం కోసం, పేరు ప్రతిష్ఠల కోసం రాయడు. ప్రజలను బాగు చేయాలని, జీవితాన్ని మరింత ఉన్నత పథాలకు నడపాలని రచయిత భావించుతాడు. ఈ పోరాటంలో పుస్తకాలను ఒక నైతిక ఆయుధంగా అతడు భావిస్తాడు.

— ఇల్యా ఎహ్రెన్ బర్గ్

సేకరణ: తవుటు నాగభూషణం

"దిగమంతే...దిగురా అయ్యా..." ఆ అడగడంలో అలకా, అభ్యర్థన, చిరుకోపం మిళితమై వున్నాయి.

ఎంకడు రిక్షా ఆపుచేసి దిగాడు. సూరి తండ్రి రిక్షాలో కూచున్నాక తొక్కడం ఆరంభించేడు.

సూరిగాడు వయసుకి చిన్నోడయినా కష్టపడ్డానికి పెద్దోడే. అది ఆళ్ళకి వరంలా ప్రసాదించిందీ వ్యవస్థ. అసలు ఎంకడి అయ్య, ఆల తాతలు కూడా పాకీలుగా, పాలేరులుగానే బ్రతుకుతూ వచ్చారు. ఎంకడి బాగార్లు ఇప్పుడు చెప్పలు కుట్టుకుంటారు. ఎంకడొక్కడే రిక్షా ఎయ్యడం చేస్తాడు.

"ఒరే ఎంకడూ...ఎంకా...సెవుడ్రా? సెవిట్ల సెట్లు బలిసిపోనాయేటి" ఆ మాట విని ఎంకడు ఆపమన్న మీదట రిక్షా ఆపాడు సూరి.

"ఏటి బాబూ వర్షంల నడిపొచ్చిస్తన్నారా?" రిక్షా దిగుతూ అడిగాడు ఎంకడు.

ఎంకడి మాటకు సమాధాన మీయకుండానే అప్పటి దాక తడుస్తూ నడుస్తున్న ఆ వ్యక్తి రిక్షాలో ఎక్కి కూర్చున్నాడు. నచ్చిమి వేపు చూసి "అటేక జరుగే గుంటా" అంటూనే పోనిమ్మన్నట్లు చూసాడు సూరివేపు. సూరి రిక్షా దిగి నడిపిస్తున్నాడు. తొక్కడం ఆ వానలో సాధ్యం కావడం లేదు. అసలు నడిపించడం కూడా ఆ వయసుకి కష్టంగా వుంది. రిక్షా దిగిన ఎంకడు రిక్షా వెనుకే తడుస్తూ నడుస్తున్నాడు. అసలే రిక్షా ఎక్కింది పెద్ద రైతు రామగోపాలం గోరు. ఆరి పక్కన కూకోడానికి దవిర్యం' ఎంకడిలో లేదు. ఎందుకంటే గోపాలంగారి అన్నల వద్దే ఎంకడి తండ్రీ, తాతలు కంబార్లుగా చేసారు."మా మోచేతి కింద గంజి నీళ్ళు తాగె టోళ్ళు మా కాళ్ళ కింద చెప్పల్లా గుండాల..."ఆ మాట ఎంకడి చెవిట్లో జోరీగలా ఫీ పెడుతోంది. ఆ మాట ఆ మాట ఈనాటిది కాదు. తన తండ్రి నాటిది.

ఏడాది పొడుగూ గొడ్డుల్లా కష్టపడ్డ కష్టానికి ఇచ్చే జీతం పది హేను పుట్ల ధాన్యం. ఇంటిల్లిపాదీ ఈదుకు రావడం కష్టమైపోయింది. ఎన్నాళ్ళని భరి స్తాడు? సహిస్తాడు? ఎన్నాళ్ళు తలవంచుతాడు? అందుకే ఎంకడి తండ్రి బుగతోరుని జీతం పెంచమని అడిగాడు. కిక్కురుమనని కంబారిగోడు నోరిప్పడం బుగతకు తల తిరిగిపోయింది. అప్పడన్న మాటది. తల బిరుసు తనమనుకున్నాడు గాని 'తిరుగుబాటు' అనుకోలేదు బుగత.

అందుకే ఎంకడు 'తల వంచలేదు'. రిక్షా స్వతంత్రంగా ఏసుకుంటు న్నాడు. అయినా అనాదిగా వస్తున్న కట్టుబాట్లు మెడని కట్టి పడేసాయి. అందుకే ఎంకడు ధైర్యంగా రామగోపాలం పక్కన కూర్చోకుండా వర్షంలో తడుస్తూ అడుగులు వేస్తున్నాడు.

ఆ చీకటిలో...చిమకులలో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ రిక్షా ముందుకు పోతూ పోతూ ఆగింది.

రిక్షా మధ్యలో ఆపేయడంతో ఆశ్చర్యంగా చూసాడు రామగోపాలం. "ఏటయిరిది రయ్యా"రిక్షా వెనుకనుంచి పరుగున ముందుకు వచ్చాడు ఎంకడు.

"అయ్యా నువ్వు రిక్షా ఎక్కి కూకో, పల్లమే కదా లాక్కెళ్లిపోతాను..." సూరి తండ్రితో అన్నాడు.

రామగోపాలం ఆశ్చర్యంగా చూస్తున్నాడు సూరిని.

"పరవానేదు ... పోనీరా..." ఎంకడు అన్నాడు.

"నాను పోనివ్వనంతే పోనివ్వను. నువ్వు ముందెక్కు. సెల్నీ ఒడిలో ఎట్టుకో... రిక్షా సరిపోతుంది..." సూరి మొండికేశాడు.

"అది కాదురా..." అనబోయాడు ఎంకడు.

"నువ్వు ముందుల ఎక్కంతే..."సూరిగాడి మాట కసిరినట్లుగా వుంది. మొండికేస్తున్నట్లు సూరిగాడి ప్రతి చర్యా తెలుపుతోంది. కచ్చా కెత్తుకుంటే వదలడనీ ... సూరిగాడిది ఉడుము పట్టనీ ఎంకడికి తెలుసు. అందుకే మారు మాటాడకుండా రిక్షా ఎక్కాడు. కూతుర్ని ఒడిలో పెట్టుకొని రామగోపాలం పక్కనే ధైర్యం తెచ్చుకొని మరీ కూర్చున్నాడు. 'నా రిక్షాలో నాను కూకుంతాను' అని గుండె దిటవు చేసుకుంటున్నాడు ఎంకడు లోలోపల.

"ఎంత పోత్రం...? ఏటేడి పోయేకాలం... నా పక్కనే కూకున్నాడే... అరే!" ఏదో అనాదిగా పాతుకు పోయిన దర్పం రామగోపాలానికి అడ్డం పడుతోంది.

వురిమురిమి చూస్తున్న గోపాలం గారి చూపు సూరిగాడ్ని భయ పెట్టలేక పోయింది. రిక్షా నెమ్మదిగా కదిలింది. రామగోపాలానికి ఒళ్ళంతా కారం పూసినట్లుంది. గుండు గీసి గాడిద మీద ఊరేగుతున్నట్లుంది. తట్టుకోలేక పోతున్నాడు. ఏదో ... ఏదో అనెయ్యాలనే వుంది.

తగువు తెచ్చుకోవాలనే వుంది. 'ఛీ...ఛీ... ఈ రోజు మైలయి పోనాను. ఇంటికెళ్ళి స్నానం సెయ్యాల..." పైకే అన్నాడు. రామగోపాలం ఎంత గింజుకుని గీపెట్టినా ఎంకడూ సూరీ యేమనలేదు. దాన్తో బుగత గోరికి మరీ మండుకొచ్చింది. అయినా రిక్షా దిగి నడిచి వెళ్ళలేక అలాగే కూర్చుండి పోయాడు.

కొంతసేపటికల్లా సూరిగాడి రిక్షా ఇల్లు చేరింది. ఎంకడు, కూతురు లచ్చిమీ దిగారు.

"ఇయ్యాల దాకొటి సేపినారు..." కనకం ఇంట్లో అడుగు పెడుతుండ డంతోనే అడిగింది.

"ముందు కూడొడ్డించు..." ఎంకడు అన్నాడు. తలలు తుడుచుకొని

వేరడి నూరిదు జలమ్మాత్రం రుక్మిణీనాథశాస్త్రిగారిని అభిమా నులు ఎవరయినా కలిసి "ఏమండీ మీరీమధ్య ఏమీ వ్రాయడం లేదే మిటి?" అనడిగితే-"ఏం ఎందుకు రాయాలి? ఏం రాయాలి? పద్యం రాస్తే విశ్వనాథతో సమానంగా, లిరిక్ రాస్తే కృష్ణశాస్త్రి వలె, గేయం రాస్తే శ్రీశ్రీ పద్ధతిలో, వచనం రాస్తే వేటూరివలె, కథలు రాస్తే చలంలాగా రాయగలిగినపుడే రాస్తాను. అలా రాయలేనప్పుడు అన్ని సన్యాసం స్వీకరించి హాయిగా చదువు కుంటూ కూర్చుంటా" అని చెప్పే వారు.

సేకరణ: చెన్నావగడ, విజయవాడ

ప్రతీ రచయితా, ప్రతీ వ్యాసకర్తా తన రచనల మీద ప్రశంసలతో బాటు, విమర్శల్ని కూడా ఆత్రుతతో స్వీకరించే దృక్పథంతో వుండాలి. అది ఎవరి కోసమో కాదు, తనని తను పరిశీలించుకోడం కోసమే. తనని తను అభివృద్ధి పరుచుకోడం కోసమే.

— రంగనాయకమ్మ

సేకరణ: తవుటు నాగభూషణం

తడిపిన బట్టలు మార్చుకొని అంతా తిండి దగ్గర కూర్చున్నారు.

ఎంకడు తింటూనే ఆలోచిస్తున్నాడు. సూరిగాడికి ఎంతో ఆనందంగా వుంది. లచ్చిమికి సరదాగా వుంది. కనకంకి అయోమయంగా వుంది.

భోజనాలయ్యాయి. అవతల వర్షం తగ్గినట్టుగా వుంది.

కాసేపయాక అంతా పడుకున్నారు.

ఎంకడికి మాత్రం నిద్ర రావడం లేదు.

"కొడుకు ఎంత పని చేశాడు? మంచి పనే చేశాడు! కానీ గోపాలం గోరు ఇంత జరిగిన దానికి ఒగ్గుతారా?!"

అయినా ఎంత మార్పు? తాత పెదవి విప్పక పోయినా తండ్రి పెదవేం కర్మ... గుండె విప్పి అడిగాడు. మరితానో "కంబారకం పెయ్యలేమ సామ్మ"న్నాడు. సొతంత్రంగా బతుకుతున్నాడు. ఇప్పుడు తన కొడుకో! తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు ఎంకడు.

"రేపు రామగోపాలం ఏం చేస్తాడో?" అన్న ప్రశ్నే ఆ ఆనందం ముందు తలెత్తలేదు. కొడుకును అభినందిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు.

తెల్లవారింది.

వీధిలో అందరూ పరిగెడుతున్నారు.

కనకం మొగుణ్ని గాభరాగా లేపింది.

"ఏటే ... ఏటయిందే" అడిగాడు ఎంకడు కళ్ళు నులుముకుంటూ.

కొడుకు సూరిగాడు అప్పటికే లుంగీ బిగించి చేపల పంచె జల్లెడ పట్టుకున్నాడు.

"ఏట్రా పరుగులూ నువ్వెక్కడికి" ఎంకడు అడుగుతూనే లేచి లుంగీ బిగించాడు.

"మన చెరువులో చేపలు పట్టేత్తన్నారు. రాత్రి వర్షానికి చేపలు ఎగబొడుస్తున్నాయట. గట్టు కూడా కొట్టేసింది. అయ్యా నువ్వూ రారా" అంటూనే పరిగెత్తాడు సూరిగాడు.

చాలా రోజుల తర్వాత చేపల పులుసు నాలుక జివ్వున లాగింది. అంతే ఎంకడు వూజి (చేపల్ని మూసే గంప) సల (వల) పట్టుకొని పరుగు తీశాడు.

"నువ్వు ఇంటి కాడుండే వచ్చిమీ ... జాకర్త..." అంటూ తపేలా పట్టుకొని కనకం కూడా పరిగెత్తింది.

చెరువు కాడికెళ్ళే సరికి ఊరంతా చెరువులోనే వుంది. జాతరలోలా వున్నారక్కడ మనుషులు. చెరువు గట్టు తెగిన దగ్గర వలలు. అడ్డం పెట్టారు. నీరే పోతోంది తప్ప, ఒక్క చేప పైకి పోవడానికి అవకాశం లేద. చిన్నా పెద్దా ... ముసలి ముతకా ఆడామగా గోచిలు బిగించి మరి చేపలు పట్టుకుంటున్నారు. వారికి ఆనందగామూ అత్భుతగామూ వుంది.

సూరిగాడు, ఎంకడు పక్క పక్కనే పడుతుంటే వారిచ్చిన చేపలు తపేలాలో వేస్తోంది కనకం. అప్పుడే ఏవి ఊర్లు పంపాలో ఆలోచిస్తోందామె.

ఎదురుగా రామగోపాలం, తండ్రి కొడుకులిద్దరి వంకా చూశాడు.

ఇంతలో ఓ సవడ రామగోపాలం వేపు నుంచి సాదుచుకొచ్చి ఎంకడి ఊజిలో దొరిక పోయింది. 'సవడ... సవడ' గెంతాడు సూరి. ఆనందంగా "ఇంట్లెట్టేసి రాయే" ఎంకడి మాటతో ఆ సవడను ఇంటికి తీసికెళ్ళింది కనకం.

మళ్ళీ ఎంకడికీ గోపాలానికీ మధ్య ఏదో చేప వున్నట్లయింది. వూజాలు అబరా గుబరాగా వేశారు. అయితే ఈసారి ఆ చేప రామగోపాలం వూజిలో చిక్కుకుంది వూజిలో చెయ్యి పెడుతూనే 'అమ్మా' అని చెయ్యి పైకి తీశాడు. అరచేతి వేళ్ళ నిండా రక్తం... సన్నగా వస్తోంద.

"ఏమయింది?" అడిగాడు ఎంకడు.

కాస్సేపు సమాధానమీయలేదు గోపాలం. మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో "ఎంకా పట్టమీ మార్పు లాగున్నాది" అన్నాడు.

ఎంకడు గోపాలం గోరి వూజిలో చెయ్యి పెట్టి అతి సులువుగా నాడువుతో చేపను పట్టి పైకి తీసి "మార్పు ... సూదరది" అంటూ గోపాలం ఒడి



పంచిలో వేసాడు. అంతలోనే 'అమ్మో' అరిచాడు గోపాలం.

"ఏటయింది?" ఆత్రంగా అడిగాడు ఎంకడు.

"మార్పు ముల్లు తొడకాడ గుచ్చుకున్నాదిరా" గోపాలం గొంతులో బాధ వుంది. గోపాలం ఒడిలో నుండి ఆ చేపను తీసి మీసాల్లాంటి దాని ముల్లును విరిచేశాడు వెంకడు. తర్వాత దాన్ని మళ్ళీ ఆయన ఒడిలోనే పడేశాడు. గోపాలంగారికి చేప దొరికిందన్న ఆనందం కంటే తొడ దగ్గర మంట ఎక్కువగా వుంది. చిన్నగా రక్తం వస్తున్నా మళ్ళీ ఆశగా చేపలు పట్టడానికి ఉపక్రమించేడు గోపాలం.

"అయ్యా..." ఏదో అనబోయి ఆగిపోయాడు సూరి.

అందరూ చాపలు పడుతున్నారు.

కాస్సేపు గడిచింది.

"అమ్మో... బాబో ... నాయనో... మంట ... రక్తం... రక్తం..." అరుపులు గోపాలం గారి నోటి నుండి. నలుగురూ గుమికూడారు. ఎంకడు... సూరికూడా. ఇందాక రక్తం వచ్చిన తొడకాడ జలగ గోపాలం గార్ని పట్టేసింది. మరింత రక్తం కారుతోంది. గోపాలం ఆ జలగను పట్టుకున్నాడు. ఒళ్ళు జలదరించింది. భయం వేసింది. ఎవరో ఆ జలగను పట్టుకొని బలంగా వెనక్కి లాగుతుంటే అది మరింత సాగుతోందే తప్ప విడవడ్డం లేదు. పైగా మెత్తగా జారిపోతోంది. అప్పటికే తొడ దగ్గర చిన్న కన్నం పెట్టేసింది.

"అలాగే తొడలో కెలిపోగలద్రా" ఎవరో అన్నారు.

"అమ్మో... బాబూ... చచ్చాను" గొంతు లేస్తున్నాడు గోపాలం. అది చూసి చిన్న పిల్లలు కొందరు పకపకా నవ్వుతున్నారు. మరి కొందరు భయంతో ఒడ్డెక్కారు.

"పొగాకుంటే కసాబిసా నమిలి తున్నన దాని మీద వుమ్మండి రా" ఎంకడి బాగారి జగిలిగోడు అన్నాడు. వెంటనే ఎంకడు బొడ్డున ముచ్చి కాగితంలో దోపుకున్న పొగాకు కసికసి నమిలాడు. ఆ నమిలిన పొగాకు వుమ్మి ముద్దను గోపాలం గారి తొడ మీద వూసాడు. కానీ ఆ వుమ్మి పక్కన పడితే చేతితో తీసుకొని జలగ పట్టిన దగ్గర వేశాడు గోపాలం. జలగ ఇంకా వదిలినట్టు లేదు. ఎంకడు మరింత పొగాకు వుమ్మి ముద్దను కేంద్రించి తున్నన నాలుగయిద్దసాలు వూసేసరికి జలగ వదిలేసింది.

గోపాలంలో అంతవరకూ వున్న బాధంతా కొట్టుకు పోయింది. వర్షమొచ్చి కుళ్ళును కడిగేసినట్టు మనసెంతో నిర్మలమై పోయింది. జలగతో పాటు జాడ్యం వదిలేసినట్లుంది. కానీ తలెత్తుకోలేకపోతున్నాడు.

"మీరొద్దున కూకోండి. సూరీ-మనకి చేపలు చేసగాని, ఆయన గోరికి నాలుగు పట్టి ఒడెయ్యరా" ఎంకడు మామూలుగానే అన్నాడు. సూరి తను పట్టిన చేపలన్నీ గోపాలం గారి ఒడి పంచిలో వేస్తున్నాడు. కొద్ది సేపులోనే ఒడి నిండిపోయి భారమయ్యింది. అంతకు మించి ఏదో చెప్పలేని అనుభూతితో గోపాలం మనసూ బరువెక్కింది. ■